నిరసన ర్యాలీలో విమలక్క

'మోడీ, అమిత్ షా'పై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరపడ్డాయి

- ఆపరేషన్ కగార్‌ను విరమించాలి
- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ సంపద దోపిడీ కోసం మోడీ, అమిత్ షా చేస్తున్న క్రూర మానవ మరణా హోమంపై ప్రజలు తిరగబడే రోజు దగ్గర్లో ఉందని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క అన్నారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలో అరుణోదయ సాంస్కృతిక సమైఖ్య ఆధ్వర్యంలో ఆపరేషన్ కంగార్‌కు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విమలక్క హాజరై మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే రద్దుచేయాలని, మధ్య భారతంలోని పోలీస్ సాయుధ బలగాలను వెనక్కి రప్పించాలని, బీజపూర్, నారాయణపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(మావోయిస్టు) నాయకులు నంబళ్ల కేశవరావుతోపాటు మరో 26మంది మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించాలని, కేంద్రప్రభుత్వం తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరారు. ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, మానవ హననంపై ప్రజలు, ప్రజస్వామ్యవాదులు ఖండించాలన్నారు. అంబానీ, అదానీల క్షేమం తప్ప ప్రజల గోసలు ఈ పాలకులకు పట్టవన్నారు. ఆదివాసులను, విప్లవ కారులను కాపాడుకోవడానికి ఇంటికి ఒక్కరు నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం విమలక్క, ప్రసాదన్న, మండల యుగేందర్, వెల్తురు సదానందం, పట్లోళ్ల నాగిరెడ్డి, మల్లేష్, నున్న అప్పారావు, ప్రతాప్ తదితరులు ములుగు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అరుణోదయ సాంస్కృతిక కళాకారులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- సిఎస్ కె రామకృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు నిర్మిస్తున్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్‌తో కలిసి కలెక్టర్లు, ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సోమవారం ఆస్పత్రి ప్రాంగణంలోని సమావేశం హాల్లో పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ.. ప్రజల వైద్య అవసరాల కోసం నిర్మిస్తున్న ఈ ఆస్పత్రిని వేగవంతంగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఆధునిక సదుపాయాలతో నిర్మిస్తున్నామని, ఇది ఐకానిక్ ఆస్పత్రి అని, మెరుగైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. అనంతరం ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనుల గురించి అధికారులు సీఎస్‌కు వివరించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి మ్యాప్‌లను పరిశీలించారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి వరంగల్ ఎన్ఐటి అతిథి గృహానికి చేరుకున్న రామకృష్ణారావుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మెన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే స్వాగతం పలికారు. ఈ సమీక్షలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ నరేంద్రకుమార్, ఆర్‌అండ్‌బి చీఫ్ ఇంజినీర్ రాజేశ్వర్‌రెడ్డి, ఎస్ఈ నాగేంద్ర, ఎల్‌అండ్‌టి ఏరియా మేనేజర్ సెంకట్‌రెడ్డి, కెఎంసి ప్రిన్సిపల్ రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజనర్సింహ

కోవిడ్ జీనోమ్ సీక్వెన్సింగ్ డిసిఎంబి, సిడిఎఫ్‌డికి నమూనాలు

- డిహెచ్ కు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోవిడ్ జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం సిసిఎంబి, సిడిఎఫ్‌డీలకు నమూనాలు పంపించాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్‌ను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ లోని సచివాలయంలో దేశంలో కోవిడ్ వ్యాప్తి, సీజనల్ వ్యాధుల నివారణపై ఆయన సంబంధిత నిపుణులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోవిడ్ జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం శాంపిళ్లను పంపించాలని సిసిఎంబి, సిడిఎఫ్‌డి డైరెక్టర్లు మంత్రికి విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ముందు నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు సీసీఎంబీ, సీడీఎఫ్‌డీ, బీబీనగర్ ఎయిమ్స్, నిమ్స్ తదితర సంస్థలతో కలిసి సివియర్ అక్యూట్ రెస్పిరేటరీ ఇల్‌నెస్ (ఎస్ఏఆర్ఐ), ఇన్ఫ్లుయేంజా లైక్ ఇల్‌నెస్ (ఐఎల్ఐ) సర్వైలెన్స్ చేయాలని సూచించారు. ప్రతి జిల్లాలోనూ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, మున్సిపల్, ఇతర డిపార్ట్‌మెంట్లతో సమన్వయం చేసుకుంటూ, ప్రతి గ్రామంలో, పట్టణంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు సామాజిక మాధ్యమాలను విరివిగా ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు. డెంగీ, మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో పంచాయతీరాజ్, మున్సిపల్ డిపార్ట్‌మెంట్లను అప్రమత్తం చేయాలనీ, ఆరోగ్యశాఖ నుంచి స్పెషల్ టీమ్‌లను పంపించి అవేర్‌నెస్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలు మొదలయ్యాయనీ, సీజనల్ వ్యాధులతో హాస్పిటళ్లలో ఒపి, ఐపి పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేషెంట్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మందులు, డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్, మెడికల్ రీఏజెంట్స్ సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. శానిటేషన్, డైట్ నిర్వాహణ సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయివేటు హాస్పిటళ్లపై నిఘా పెంచాలనీ, డెంగీ, ప్లేట్‌లెట్ల పేరిట ప్రజలను దోచుకునే ప్రయత్నం చేస్తే, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దగ్గు, జలుబు, జ్వరం, డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

ఇప్పటికైతే ప్రమాదం లేదు : నిపుణులు

సీసీఎంబీ డైరెక్టర్ వినయ్ నంబికూరి సహా ఇతర నిపుణులంతా ఇండియా, ఇతర దేశాల్లో ఉన్న పరిస్థితులను మంత్రికి వివరించారు. ఇప్పటివరకూ ఉన్న సమాచారం, పరిశోధనల ప్రకారం కోవిడ్‌తో ఇప్పటికైతే ప్రమాదమేమీ లేదన్నారు. వివిధ దేశాల్లో అక్కడక్కడా కేసులు పెరుగుతున్నా, హాస్పిటలైజేషన్ అసలు లేదని తెలిపారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతూ, బలహీనమైన రోగ నిరోధక శక్తి ఉన్న పేషెంట్లు జాగ్రత్తగా ఉంటే సరిపోతుందన్నారు. సాధారణ ప్రజలు ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరమైతే ఇప్పుడు కనిపించడం లేదని మంత్రికి వివరించారు. కోవిడ్‌పై తమ పరిశోధనలు నిరంతరం కొనసాగుతున్నాయనీ, వివిధ దేశాల్లో అప్పుడప్పుడు సైలెంట్‌గా కేసులు పెరుగుతున్నాయనీ, క్రమంగా తగ్గిపోతున్నాయని వెల్లడించారు.

విద్యుత్ కొరత సమస్య రాదు

- 2029 నాటికి 20 వేల విద్యుత్ ఉత్పత్తి
- దెయ్యాలకు నాయకత్వం వహించిన కెసిఆర్ దేవుడు ఎలా అవుతారు?
- పదేళ్ల ఉద్యోగుల బకాయిలు రూ.8 వేల కోట్లు క్లియర్
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భావితరాలకు విద్యుత్ సమస్య రాకుండా 2029నాటికి 20 వేల మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చెప్పారు. దెయ్యాలకు నాయకత్వం వహించిన కెసిఆర్ దేవుడు ఎలా అవుతారు? దెయ్యాలను రాష్ట్ర పొలిమేరల నుంచి తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలంలో సోమవారం విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభం, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో భట్టి ప్రసంగిస్తూ.. కెసిఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని ఆయన కూతురు కవిత ఇప్పుడు చెబుతున్నారు.. కానీ ఎన్నికల ముందే రాష్ట్ర ప్రజలు ఈ దెయ్యాలను వదిలించుకొని ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని అన్నారు. వారు రాష్ట్రాన్ని లూటీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో రెండు దశాబ్దాలపాటు రాష్ట్ర అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలను ప్రజా ప్రభుత్వం చేస్తోందని తెలిపారు. తన దగ్గరకు ఇప్పుడు ఎవరూ రావడం లేదని కేసీఆర్ దు్ఃఖ పడుతున్నారని ఎద్దేవా చేశారు. వందమంది కేసీఆర్‌లు అడ్డం వచ్చినా రాష్ట్ర ప్రగతి ఆగదని స్పష్టం చేశారు. కులగణనను విజయవంతంగా ఎలా పూర్తి చేశారని దేశంలోని మిగతా రాష్ట్రాల వారు అడుగుతున్నారని తెలిపారు. 10 సంవత్సరాలు పాలించిన కేసీఆర్ ఉద్యోగులకు రూ.పది వేల కోట్ల బకాయిలు పెడితే.. తాము అధికారంలోకి వచ్చాక అందులో ఎనిమిది వేల కోట్ల బకాయిలు క్లియర్ చేశామని చెప్పారు. ప్రజా సంక్షేమ పథకాలు ఉన్నాయి కాబట్టి మిగతా బకాయిలను దశలవారీగా పూర్తి చేస్తామని ఉద్యోగులను ఒప్పించామని తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో 10 సంవత్సరాల పాటు కేసీఆర్ ఒక్కసారి కూడా గ్రూప్ వన్ పరీక్ష నిర్వహించలేకపోయారని విమర్శించారు. తాము ఏడాదిలోనే లక్ష ప్రభుత్వ ఉద్యోగాల కలను సాకారం చేశామన్నారు. 57 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. మరో 30వేల ఉద్యోగాలు ప్రాసెస్‌లో ఉన్నాయని తెలిపారు. ఉద్యోగం రాని యువత కోసం రూ.9,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాన్ని తీసుకొచ్చామని అన్నారు.

మాట్లాడుతున్న భట్టి

కెసిఆర్‌కు దు్ఃఖం ఎందుకు?

రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇస్తున్నందుకా, సన్నధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నందుకా? మీకు దు:ఖం ఎందుకు? అని కేసీఆర్‌ను భట్టి విక్రమార్క ప్రశ్నించారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీని 10 సంవత్సరాల కాలంలో వాయిదాల పద్ధతిన మాఫీ చేస్తే.. అది ఆనాడు బ్యాంకు వడ్డీలకే సరిపోయిందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరంభంలోనే ఒకేసారి రూ.22 వేల కోట్ల రైతు రుణమాఫీ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. రైతులే కాదు భూమిలేని కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు అందిస్తున్నామని, 2,000 అదనంగా పెంచి రైతు భరోసా ఇస్తున్నందుకు చూడలేక ఫామ్‌హౌస్‌లో పడుకున్న కేసీఆర్ కన్నీరు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. అచ్చంపేటలో రూ.12,600 కోట్లతో నల్లమల డిక్లరేషన్ చేశామని, ఈ దేశ చరిత్రలో ఎవరూ ఇప్పటివరకు చేయలేదని వివరించారు. ధనిక రాష్ట్రాన్ని చేతికి ఇస్తే ఆనాడు 200 యూనిట్ల వరకు పేదలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఆలోచన కేసీఆర్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో భవిష్యత్ తరాలకు మిగులు విద్యుత్ అందిస్తామని, ఇతర రాష్ట్రాలకు విద్యుత్‌ను అమ్మే స్థాయికి ఎదుగుతామని ధీమా వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ ప్రాజెక్టు జీవో ఇచ్చిందే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అని చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గంలో 45వేల పంపుసెట్లకు సోలార్ పవర్ ఏర్పాటు చేయడంపై విద్యుత్ శాఖ అధికారులు అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, జి.మధుసూదన్‌రెడ్డి, తుడి మేఘారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి, డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సరస్వతీ నది పుష్కరాలు

కాళేశ్వరంలో చివరి రోజు మూడున్నర లక్షలమంది స్నానాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం దేవస్థానంకు ఆనుకొని ఉన్న త్రివేణి సంగమంలోని సరస్వతి నదిలో 12 రోజుల పాటు పుష్కరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది సందర్శకులు కాళేశ్వరానికి చేరుకొని సరస్వతి నదికి, సంగమంకు పుష్కర ఘాట్‌వెళ్లి పుణ్య స్నానాలు ఆచరించారు. కాగా, చివరి రోజు సోమవారం సాయంత్రం 7.30గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు, అధికారులు ఆలయ సంప్రదాయాలతో దేవస్థానం నుంచి శోభాయాత్రగా సరస్వతి నది సంగమం వరకు వెళ్లి కలశాలతో ముక్తీశ్వరుడిని అభిషేకించారు. అక్కడే నదీమ తల్లికి హారతి పట్టి చీర, సారెతో సాగనంపి తిరుగు ముఖం పట్టారు. చివరి రోజు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 3.50 లక్షల మంది సందర్శకులు కాళేశ్వరానికి వచ్చి స్నానాలు ఆచరించారు. అనంతరం ముక్తీశ్వర స్వామిని దర్శనం చేసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే పర్యవేక్షణలో ఆయా శాఖల అధికారులు పకడ్బందీ వసతులు కల్పించారు. గత 11రోజులుగా గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీ త్రివేణి సంగమంలో పుష్కర స్నానం, స్వామి వారి దర్శనం కోసం వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం తాగునీరు సరఫరా, త్రివేణి సంగమం వరకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడం జరిగింది. వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఒఆర్ఎస్, అస్వస్థతకు గురైన యాత్రికులకు వైద్య సేవలు అందించారు. పంచాయతీరాజ్ విభాగం మూడు షిఫ్టుల వారీగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా మంచినీరు, మరుగుదొడ్లు నిర్వహణ చేశారు. విద్యుత్తు శాఖ ద్వారా నిరంతరం విద్యుత్తు సరఫరా చేశారు. చిన్నారులు అట బొమ్మలు కొనుగోళ్లు, శీతల పానీయాలు, నిమ్మ రసం, లస్సీ, విజయ డైరీ ఉత్పత్తులు, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ ఏర్పాటు చేసిన తాగునీరు సేవించి ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందారు.

రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆధార్ -ఈ సంతకం

- త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆధార్ - ఈ సంతకం సేవలు అమలు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగంపై ఆ శాఖ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆధార్- సంతకం వల్ల పది నుంచి 15 నిముషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని వీలైనంత త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ అందుబాటులోకి రానున్న నేపథ్యంలో సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పఠాన్‌చెరు, యాదగిరిగుట్ట, గండిపేట, సూర్యాపేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అదనంగా ఎస్ఆర్‌వోలను నియమించినట్టు తెలిపారు.

చేనేతరంగాన్ని ప్రభుత్వం పరిరక్షించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం - చెరుపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యంత ప్రాధాన్యత ఉన్నది చేనేత రంగమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆ రంగం పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేనేత వృత్తి పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిర్వీర్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులను కేటాయించడం తోపాటు వృత్తిని ఆధునీకరించి చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు చేనేత రంగాన్ని పరిరక్షించాలనే డిమాండ్‌పై తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం మఖ్దూభవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ తరహాలో బిసిల అభివృద్ధికి సైతం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. తద్వారా కుల వృత్తుల పరిరక్షణకు దోహదపడుతుందనీ, నిధులను కేటాయించి వృత్తులను ఆధునీకరిస్తే వాటిపై ఆధారపడిన కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందని వివరించారు. చేనేత కార్మికులు దీర్ఘ కాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని చెప్పారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక దాటేసే ప్రయత్నం చేస్తోందనీ, ఇది మంచిది కాదని విమర్శించారు. ఇలాంటివి చేస్తే భవిష్యత్‌లో అధికారానికి దూరమవుతారని హెచ్చరించారు. చేనేత రంగం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. అందుకోసం చేనేత కార్మికులంతా సంఘటితం కావాలన్నారు. సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పాలకులందరూ ఒక్క తాను ముక్కలేనని విమర్శించారు. ఓటు బ్యాంక్ రాజకీయాలు తప్ప వారికి వృత్తిదారుల సమస్యలను పరిష్కారించాలనే చిత్తశుద్ధి లేదన్నారు. రైతాంగం తరహా ఉద్యమాన్ని చేనేత కార్మికులు చేపట్టాల్సిన అవసరముందన్నారు. ఇందుకు రాజకీయాలకు అతీతంగా విశాల వేదిక ఏర్పాటు చేసుకుని ఉద్యమించినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి మాట్లాడుతూ పద్మశాలీలు చట్టసభల్లో అడుగు పెట్టాలన్నారు. అప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. చేనేత రంగ నిపుణులు దొంతి నర్సింహారెడ్డి మాట్లాడుతూ జిడిపిలో చేనేత రంగం వాటా ఐదు శాతం ఉందని వివరించారు. కానీ ఈ రంగంపై ఆధారపడిన కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గతంలో చేనేత రంగానికి నాబార్డు ద్వారా రూ.వెయ్యి కోట్ల రుణం ఇచ్చేదనీ, దాన్ని పూర్తిగా నిలిపేయడంతో చేనేత కార్మికులు ప్రయివేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలనీ, ఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా నిధులను కేటాయించాలని డిమాండ్ చేస్తూ పలు తీర్మానాలను ఆమోదించింది. తెలంగాణ చేనేత కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన నిర్వహించిన ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మి నరసయ్య, చేనేత సంఘాల నాయకులు కర్నాటి ధనంజయ, దేవదాసు, రాపోలు జగన్, దాసు సురేష్, రాపోలు వీర మోహన్, ఏశాల అశోక్, కోట రాజయ్య, జల్టి రాములు, పెండెం సర్వేశం, చేవూరి ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కూనంనేని

ట్రాన్స్‌జెండర్లను సమాజంలో భాగస్వామ్యం చేస్తున్నాం

- పైలట్ ప్రాజెక్టుపై సమీక్షలో మంత్రి డాక్టర్ సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ట్రాన్స్‌జెండర్లను సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం చేస్తున్నామనీ, వారికి అంగవైకల్య కోటా కింద ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) చెప్పారు. ట్రాన్స్‌జెండర్ల సాధికారత, భాగస్వామ్యం వైపు ఒక కీలక అడుగు వేస్తూ 2024 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో 44 మంది ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయాన్ని గుర్తుచేశారు. వారికి గౌరవప్రద ఉపాధిని కల్పించడానికి ఇది ఒక ముఖ్యమైన చర్య అని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్ వర్గాన్ని చేర్చుకోవాలని నిర్ణయం తీసుకున్న తొలి రాష్ట్రం తెలంగాణనే అని గర్వంగా చెప్పారు. ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్ల నియామకం పైలట్ ప్రాజెక్ట్‌పై సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్క అధ్యక్షతన సమీక్ష జరిగింది. అందులో డీజీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ కమిషనర్ శైలజ, ఎన్‌జీఒ సంస్థల ప్రతినిధులు, ట్రాఫిక్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

ప్రభుత్వ బడులపై నమ్మకం పెరిగేలా చూడాలి

- ఎంఇఒలకు విద్యాశాఖ సంచాలకులు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో మండల విద్యాధికారులు (ఎంఇఒ)దే కీలక పాత్ర ఉంటుందని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి చెప్పారు. నాయకత్వం, పర్యవేక్షణ, విద్యాశాఖ కార్యక్రమాలపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో సోమవారం ప్రారంభమైంది. 629 మంది ఎంఈవోలకు గాను రెండు విడతల్లో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మొదటి విడతలో 304 మంది ఎంఇవోలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ మండల స్థాయిలో ఉపాధ్యాయుల శిక్షణను నిర్వహించినందుకు ఎంఈవోలను అభినందించారు. ఎంఈవోలందరూ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపర్చడం కోసం కృషి చేయాలని ఆదేశించారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రతి మండలానికీ ఎంఈవో ఉన్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగేలా వారి పనితీరు ఉండాలన్నారు. బడిబాట కార్యక్రమంలో ఎంఇఒ ప్రత్యేక కార్యాచరణతో వారి మండలంలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ, స్థానిక సంస్థలు, మోడల్ స్కూళ్లు, కెజిబివి, గురుకులాలు, యూఆర్ఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న 1,22,854 మంది ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఈనెల 13 నుంచి ప్రారంభించామని గుర్తు చేశారు. వారికి శిక్షణ ఇచ్చేందుకు 5,605 మంది రిసోర్స్ పర్సన్లకు ఐదు రోజులు శిక్షణ ఇచ్చామని అన్నారు. ఇప్పటి వరకు రెండు విడతల్లో 866 కేంద్రాల్లో 94,794 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామని వివరించారు. మిగిలిన వారికి మూడో విడతలో సోమవారం నుంచి ఈనెల 30 వరకు నిర్వహిస్తామన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION)
:: NANDYAL ::
I.A.No. 306 /2024 IN O.S.No. 15 / 2021
Bhuma Ramachandra Reddy,
S/o Pedda Venkata reddy,
aged 53yrs, Hindu, business,
R/o H. No. 16/11A, Bondili veedhi,
Nandyal town and district
... Petitioner/Plaintiff
Versus
Bijjala Chinna Hussain Reddy,
died by his LRs .... Respondent/Defendant
2. Bijjala Uma Pushpa Latha
W/o Jagadeeswar Reddy, aged 49yrs,
Hindu, housewife, r/o Flat No. 201
Harsha Pride, Venkata Ramana colony,
Kurnool town and district,
3. Bijjala Ravi Mohan Reddy
S/o late Bijjala Chinna Hussain Reddy,
aged 45yrs, Hindu, software employee,
present r/o Flat No. 17, Namratha nest,
3rd floor, 301 Apartments, Goutami nagar,
Nijampet, Hyderabad, Telangana,
4. Bijjala Chakravardhan Reddy
S/o late Bijjala Chinna Hussain Reddy,
aged 43yrs, Hindu, software engineer,
R/o Kranthi Nagar,
Nandyal Town and District.
... Proposed Respondents/ Defendants
NOTICE TO PROPOSED RESPONDENT/DEFENDANT No. 3 AND 4
Please take notice The Petitioner/Plaintiff was filed suit against the Respondents for specific performance of agreement of sale. The Petitioner/Plaintiff filed a petition under order 22 rule 4 and order 6 rule 17 and section 151 of CPC.
The Proposed Respondent/Defendant No.3 and 4 are here by directed to appear before the Hon'ble court on 18-06-2025 at 10.30 AM and to file objections if any, otherwise matter will be decided in your absence.
(By court order)
Hearing Date : 18-06-2025
T.THULASI REDDY,
ADVOCATE, NANDYAL
CELL NO. 9440750570

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION)
:: NANDYAL ::
I.A.No. 305 /2024 IN O.S.No. 15 / 2021
Bhuma Ramachandra Reddy,
S/o Pedda Venkata reddy,
aged 53yrs, Hindu, business,
R/o H. No. 16/11A, Bondili veedhi,
Nandyal town and district
... Petitioner/Plaintiff
Versus
Bijjala Chinna Hussain Reddy,
died by his LRs .... Respondent/Defendant
2. Bijjala Uma Pushpa Latha
W/o Jagadeeswar Reddy, aged 49yrs,
Hindu, housewife, r/o Flat No. 201
Harsha Pride, Venkata Ramana colony,
Kurnool town and district,
3. Bijjala Ravi Mohan Reddy
S/o late Bijjala Chinna Hussain Reddy,
aged 45yrs, Hindu, software employee,
present r/o Flat No. 17, Namratha nest,
3rd floor, 301 Apartments, Goutami nagar,
Nijampet, Hyderabad, Telangana,
4. Bijjala Chakravardhan Reddy
S/o late Bijjala Chinna Hussain Reddy,
aged 43yrs, Hindu, software engineer,
R/o Kranthi Nagar,
Nandyal Town and District.
... Proposed Respondents/ Defendants
NOTICE TO PROPOSED RESPONDENT/DEFENDANT No. 3 AND 4
Please take notice The Petitioner/Plaintiff was filed suit against the Respondents for specific performance of agreement of sale. The Petitioner/Plaintiff filed a petition under order 9 rule 9 and section 151 of CPC.
The Proposed Respondent/Defendant No.3 and 4 are here by directed to appear before the Hon'ble court on 18-06-2025 at 10.30 AM and to file objections if any, otherwise matter will be decided in your absence.
(By court order)
Hearing Date : 18-06-2025
T.THULASI REDDY,
ADVOCATE, NANDYAL
CELL NO. 9440750570

ప్రతి ఒక్కరిపై ప్రభుత్వ బడుల పరిరక్షణ బాధ్యత

- సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించుదాం
- వాటిలోనే విద్యార్థుల సమగ్ర వికాసం
- చావ రవి

ప్రచార జాతాలో చావ రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపుదలకు టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'బడి బాట ప్రచార జాతా' సోమవారం పలు జిల్లాల్లో ప్రారంభమయ్యాయి. ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జాతాను స్థానిక వైరా రోడ్‌లో సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సుశిక్షితులైన ఉపాధ్యాయులు, విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం ఉన్నాయన్నారు. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను ఉచితంగా పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్కులు, ఏకరూప దుస్తులు ఉచితంగా పంపిణీ చేస్తారని చెప్పారు. వీటితోపాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, వారానికి మూడు సార్లు కోడిగుడ్లు, రాగిజావ వంటి పౌష్టికాహారం అందిస్తున్నారని వివరించారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రభుత్వ పాఠశాలలు దోహదపడుతాయని, గుడి, మసీదు, చర్చిల నిర్మాణం కోసం ఐకమత్యంగా కదిలే ప్రజలు ఊరి బడి కోసం కూడా ఏకమవ్వాలని కోరారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని.. టిఎస్ యుటిఎఫ్ శ్రేణులు సోమవారం నుంచి పది రోజులు పాటు ప్రచారం నిర్వహిస్తాయని ప్రకటించారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన, ఉచిత పరీక్షలు నిర్వహిస్తారని, అత్యున్నత విద్యార్హతలు కలిగిన టీచర్లు ఉంటారని తల్లిదండ్రులకు వివరిస్తామని చెప్పారు. తల్లిదండ్రుల ఆకాంక్షను ప్రయివేటు విద్యా వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. చదువుల నాణ్యతలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల మధ్య పెద్దగా వ్యత్యాసం లేదని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. సంపాదనలో సగానికి పైగా పిల్లల చదువుల కోసమే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ బడి మూతపడితే సమాజానికి నష్టమని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనా ఉందని అన్నారు. 'మన ఊరు - మనబడి', అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా మౌలిక వసతుల కల్పన మెరుగైందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించటానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. ఏఐ ఆధారిత బోధన, డిజిటల్ తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబరేటరీలతో పాటు ఆటపాటలతో అహ్లాదకరమైన వాతావరణం, ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ, నిపుణులైన ఉపాధ్యాయులతో ఒత్తిడి లేని చదువు అందిస్తున్నట్టు తెలిపారు. పిల్లల మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసానికి అనువుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని అన్నారు. బడికి అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే తప్పనిసరిగా బడి నిలబడుతుందని తెలిపారు. ఖమ్మంలోని వైరా రోడ్డు, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, ఎన్‌టిఆర్ సర్కిల్, ఇల్లందు క్రాస్ రోడ్డు ఏరియాల్లో తొలిరోజు ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార జాతాలో సంఘం జిల్లా అధ్యక్షులు రంజాన్, ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు జివి నాగమల్లేశ్వరరావు, బుర్రి వెంకన్న, వల్లంకొండ రాంబాబు, బాణోత్ రాందాస్, లివిన్ స్టన్, ధర్మసోత్ నాగేశ్వరరావు, పినపాక సురేష్, కట్టా పద్మ, వి దామోదర్, ఉద్దండ్, మంగీలాల్, నెల్లూరి వీరబాబు, ఏడునూతల.రవికుమార్, జి భిక్షపతి, యు నాగేశ్వరరావు, డి శ్రీనివాస్, శివకోటి తదితరులు పాల్గొన్నారు.

ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీతో ప్రాణాంతకం

- డాక్టర్ జ్యోతి కంకణాల

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రాణాంతకమైన ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీతో బాధపడుతున్న 23 ఏళ్ల మహిళకు హైదరాబాద్‌లోని సిటిజన్స్ స్పెషాలిటీ హాస్పిటల్ విజయవంతంగా చికిత్స అందించినట్లు ఆ హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. ఓ రోగిని తీవ్రమైన కడుపు నొప్పి, ఊపిరి ఆడకపోవడం, తల తిరగడం, బలహీనతతో బాధపడుతున్న పరిస్థితిలో ఆసుపత్రికి తీసుకువచ్చారని.. వైద్య బృందం వెంటనే అవసరమైన పరీక్షలు నిర్వహించి ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీని గుర్తించినట్లు వెల్లడించాయి. ఈ కేసు గురించి డాక్టర్ జ్యోతి కంకణాల మాట్లాడుతూ.. "ఈ రకమైన గర్భధారణను ముందుగానే నిర్ధారించడం చాలా ముఖ్యం ఎందుకంటే ఇది ప్రాణాంతకం కావచ్చు. ఫలదీకరణ చెందిన అండం గర్భాశయం వెలుపల పెరుగుతున్నప్పుడు ఎక్టోపిక్ గర్భం సంభవిస్తుంది. సకాలంలో రోగ నిర్ధారణ చేసి చికిత్స చేయకపోతే ఎక్టోపిక్ గర్భాలు ప్రాణాంతకం కావచ్చు. వేగంగా మేము స్పందించటం, అధునాతన శస్త్రచికిత్సా పద్ధతులు రోగికి ఉత్తమ సంరక్షణ లభించేలా చేశాయి. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటం చేత డిశ్చార్జ్ చేయబడింది" అని అన్నారు.

హైదరాబాద్‌లో జియోస్టార్ రీజనల్ రోడ్‌షో

హైదరాబాద్: తెలుగు ప్రేక్షకులు, దక్షిణాదిలోని అడ్వర్టైజింగ్ కమ్యూనిటీకి మరింత చేరువయ్యే దిశగా జియోస్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ తమ తొలి దశ రీజనల్ రోడ్‌షోను హైదరాబాద్‌లో నిర్వహించినట్లు తెలిపింది.. ప్రాంతీయ కంటెంట్ శక్తి సామర్థ్యాలను చాటి చెప్పేందుకు, వినియోగదారుల అభిప్రాయాలను పంచుకునేందుకు చేసుకునేందుకు, టివి, డిజిటల్ మాధ్యమాలవ్యాప్తంగా ఆకట్టుకునే కంటెంట్‌తో బ్రాండ్‌లకు మరింత ప్రాచుర్యం లభించేలా చూడటంలో నెట్‌వర్క్ ఏ విధంగా తోడ్పడుతోందనేది తెలియజెప్పేందుకు వివిధ నగరాలవ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాలకు జియోస్టార్ దీనితో శ్రీకారం చుట్టినట్లు ఆ సంస్థ ప్రతినిధి అజిత్ వర్గీస్ తెలిపారు.

జీలుగ విత్తనాల కోసం క్యూలైన్లో రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా జోగిపేటలో సోమవారం వ్యవసాయ కార్యాలయం ముందు జీలుగ విత్తనాల కోసం రైతులు తమ పట్టాదారు పాసు బుక్‌లను క్యూ లైన్‌లో పెట్టి విత్తనాల కోసం ఎగపడ్డారు. ఉదయం నుంచే రైతులు కార్యాలయానికి చేరుకున్నారు. అధికారులు రాకముందే భారీ సంఖ్యలో రైతులు అక్కడికి చేరుకొని క్యూ లైన్‌లో ఉన్నారు. కూపన్ల కోసం రైతులు ఇబ్బందులు పడ్డారు. తమకు దొరుకుతాయో లేదో అని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు మాత్రం 300 క్వింటాళ్ల పంపిణీ చేసినట్లు తెలిపారు.

గోదావరిలో మునిగి ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్మల్ జిల్లా బాసర మండలంలోని జ్ఞానసరస్వతి క్షేత్రానికి వచ్చి, గోదావరి నది పుణ్యస్నానానికి వెళ్లిన ఇద్దరు ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి ప్రాణం కోల్పోయారు. బాసర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర పర్భని జిల్లాలోని టాక్లి గ్రామానికి చెందిన కుల్దీప్ బాలా సాహెబ్(11), నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన బొల్లమల్ల రాజు(40) గోదావరి నదిలో స్నానం చేస్తుండగా మునిగిపోయారు. స్నానపు ఘాట్ వద్ద తమ వారి మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు అక్కడ ఉన్నవారిని కలిచివేసింది. మృతదేహాలను వెలికి తీసి భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డెక్కిన ధాన్యం రైతులు

- ఐదు గంటలపాటు కొనసాగిన నిరసన
- రోడ్డుపైనే వంటావార్పు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండల కేంద్రమైన తాడిచెర్లలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కొనడంలేదంటూ, లంచాలు ఇచ్చినవారికే కాంటాలు పెడుతున్నారని ఆరోపిస్తూ సోమవారం తాడిచెర్ల-మల్లారం ప్రధాన రహదారిపై బాధిత రైతులు బైటాయించి ఆందోళన నిర్వహించారు. సుమారు ఐదు గంటలపాటు నిరసన తెలిపారు. ఇటు తాడిచెర్ల, అటు పెద్దతూండ్ల రోడ్డుకు అడ్డంగా వాహనాలు వెళ్లకుండా ట్రాక్టర్ అడ్డంపెట్టి రోడ్డుపై టెంట్ వేసి ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ.. రోడ్డుపై భీష్మించుకు కూర్చున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం భోజనానికి వెళ్లకుండా రోడ్డుపైనే వంటావార్పు చేపట్టారు. అలాగే కొయ్యూర్ ప్రధాన రహదారిపై ధాన్యం అమ్ముకోవడానికి కల్లంలో పోసి వారాలు గడుస్తున్నా కాంటాలు పెట్టే దిక్కులేదని బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ధాన్యం అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రంలో పోసి 20 రోజులుగా పడిగాపులు కాస్తున్నా నిర్వాహకులు రేపు మాపు అంటూ దాటవేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ధాన్యం మూడుసార్లు తడిసి మొలకలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి చివరిగింజ వరకు కొంటామని కంటితుడుపు చర్యగా చెప్పడమే తప్పా ఆచరణకు నోచుకోవడం లేదని వాపోయారు. ఆరుగాలం కష్టపడి, వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోస్తే ధాన్యం మ్యాచర్ వచ్చినా విక్రయించడం లేదన్నారు. ధాన్యం తూకం వేయడానికి గన్నీ సంచులు ఇచ్చి వారాలు గడుస్తున్నా హమాలీలు కాంటాలు పెట్టడం లేదని తెలిపారు. లారీల కొరత ఉందంటూ నిర్వాహకులు కుంటి సాకులు చెబుతూ దాటవేస్తున్నట్టు చెప్పారు. చేసేది లేక అకాల వర్షాలకు భయపడి కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యాన్ని ప్రయివేటు దళారులకు అమ్మేందుకు కొందరు రైతులు ట్రాక్టర్లలో పోసుకొని పోతున్నారని అన్నారు. ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేశారు. కాగా, ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న పిఎసిఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, వైస్ చైర్మన్ ప్రకాష్‌రావు, డైరెక్టర్ వొన్న తిరుపతిరావు, తహసీల్దార్ రవికుమార్.. రైతుల వద్దకు వచ్చి వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం గింజ లేకుండా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైస్ మిల్ అలర్ట్ లేక కొద్దిగా ఆలస్యమయిందని, మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో రైస్ మిల్ అలర్ట్ అయిందని, రైతులు ధాన్యం మ్యాచర్ వచ్చేలా చూడాలని, ఇప్పటివరకు ఎలాంటి కటింగ్స్ లేకుండా కొనుగోలు చేశామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఎసిబికి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మంరూరల్ సబ్ రిజిస్ట్రార్ జె.అరుణ రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కింది. ఓ తండ్రి తన కుమారునికి భూమిని గిఫ్టుగా రిజిస్ట్రేషన్ చేస్తున్న క్రమంలో సబ్ రిజిస్ట్రార్ కాసుల వేటకు దిగింది. దాంతో బాధితుడు ఎసిబిని ఆశ్రయించగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా, సర్కారు నిబంధనలకు విరుద్ధంగా కుప్పలు తెప్పలుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్న ఆమె తీరుపై గతంలోనే ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. ఖమ్మం నగరానికి చెందిన ఏలూరి రామకృష్ణకు ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడులో రెండు వేల గజాల స్థలం ఉంది. ఆ భూమిని తన కుమారుడు శ్రీ చరణ్ పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయాలని అనుకున్నాడు. ఇందుకు ప్రభుత్వపరంగా రూ.51 వేల చలానాను తీసి రిజిస్ట్రేషన్‌కు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో డాక్యుమెంట్ రైటర్ ద్వారా సబ్ రిజిస్ట్రార్ కాసుల వేటకు దిగింది. రామకృష్ణను తొలుత రూ.50 వేలు లంచంగా అడిగారు. అందుకు డాక్యుమెంట్ రైటర్ పుచ్చకాయల వెంకటేశ్వర్లు సబ్ రిజిస్ట్రార్‌కు మధ్యవర్తిగా వ్యవహరించాడు. అయితే అంత మొత్తం తాను ఇచ్చుకోలేనని ప్రాథేయపడినా కనికరించలేదు. ఇవ్వాల్సిందేనని పట్టుపట్టారు. కొద్ది రోజుల తర్వాత రూ.30 వేలు ఇచ్చుకోగలనని రామకృష్ణ చెప్పడంతో అందుకు అంగీకరించారు. అనంతరం రామకృష్ణ ఎసిబి డిఎస్‌పి రమేష్‌ను ఆశ్రయించాడు. దాంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. సోమవారం ఖమ్మం రూరల్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ ఎదుట మాటు వేశారు. తొలుత రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి కానిచ్చారు. అనంతరం మీడియేటర్‌గా వ్యవహరించిన పుచ్చకాయల వెంకటేశ్వర్లుకు రూ.30 వేలు ఇచ్చే క్రమంలో అత్యంత చాకచక్యంగా అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

శవాలతోనూ యుద్ధం చేస్తారా ?

- మృతదేహాలు అప్పగించకుండా ఆనవాళ్లు, సాక్ష్యాలు తారుమారు చేసే కుట్ర : రంగారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాట్లాడుతున్న రంగారావు

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, తెలుగు రాష్ట్రాల ఇతర నేతలు ఈ నెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెంది ఆరు రోజులైనా బంధువులకు వారి మృతదేహాలను అప్పగించకపోవడం కేంద్ర, రాష్ట్ర బిజెపి ఎపి కూటమి ప్రభుత్వ ఫాసిస్టు దుర్మార్గానికి నిదర్శనమని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) కేంద్ర కమిటీ సహాయ కార్యదర్శి, తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. బిజెపి, టిడిపి సర్కార్లు చచ్చిన శవాలకు కూడా భయపడి, శవాలతో యుద్ధం చేస్తున్నాయని విమర్శించారు. సోమవారం ఖమ్మంలోని సిపిఐ(ఎంఎల్), మాస్ లైన్(ప్రజాపంథా) జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించాలని, అంత్యక్రియలు గౌరవ ప్రదంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నిర్బంధం, బెదిరింపులు ఆపాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారి భౌతికకాయాలను అప్పగించడానికి ఆరు రోజులుగా ఆలస్యం చేయడంలో ఆనవాళు,, సాక్ష్యాలను కనిపించకుండా చేసే కుట్ర ఉందని ఆరోపించారు. ప్రభుత్వాల, పోలీసుల ఈ దుర్మార్గ వైఖరి చూస్తే పట్టుకువచ్చి కాల్చి చంపినట్టు వచ్చే వార్తలను విశ్వసించేలా ఉందని అన్నారు. మధ్య భారతంలో నరమేధం సృష్టిస్తున్నారని, సరిహద్దుల్లో చేసే యుద్ధం దండకారణ్యంలో చేస్తున్నారని, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు విధానంలో భాగంగానే ఇది జరుగుతున్నదని తెలిపారు. అడవుల్లో దొరికే 29 రకాల విలువైన ఖనిజాల కోసం, కార్పొరేట్ కంపెనీల లాభాల దాహం కోసం ఈ నరమేధం చేస్తూ, రక్త పిపాసులుగా కేంద్రం మారిందని ఆరోపించారు. ఇప్పటికైనా నరమేధం ఆపి, శాంతి చర్చలు జరపాలని, శవాలను బంధువులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని ఎన్‌కౌంటర్‌లపై, ఆదివాసుల మరణాలపై న్యాయవిచారణ జరపాలని కోరారు. రాష్ట్ర నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యని, ఇతర రాజకీయ, ప్రజాసంఘాల నేతలను జియానపేట పోనియకుండా అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, గండమళ్ల రామయ్య, ఝాన్సీ, మలీదు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మిస్ మిల్లా ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి

- ఐద్వా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిస్‌మిల్లా మాగి ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా మిస్ ఇంగ్లాండ్ నుండి పాల్గొన్న మిస్ మిల్లామాగి నిర్వాహకుల తీరుపైన, మిస్ వరల్డ్ సంస్థపైన కొన్ని ఆరోపణలు చేశారు. ముఖ్యంగా తమను వేశ్యకంటే అధ్వాన్నంగా చూశారనీ, విందు ఏర్పాటు చేసిన సందర్భంగా మధ్య వయస్సు ఉన్న పురుషులను సంతోషపెట్టాలని వేధించారని మిల్లా ఆరోపించారు' అని గుర్తు చేశారు. దీనిపై మిస్ వరల్డ్ సీఈవో జూలియామోర్లే వివరణ ఇచ్చినప్పటికీ మిస్ మిల్లా ఆరోపణలు చేయాల్సిన అవసరమేమొచ్చిందని ప్రశ్నించారు. ప్రపంచ దేశాలకు మన రాష్ట్ర కీర్తి చాటుతామంటూ చెప్పి తెలంగాణలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మరి ఇలాంటి ఆరోపణల్లో వాస్తవమేంటీ? వారిని వేధించిన వారు ఎవరు? తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపి దోషులపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కమీషన్‌లతో జేబులు నింపుకోవడానికే టెండర్లు

- ఇప్పటికైనా చెరువుల్లో చేప పిల్లలు వదిలి ముదిరాజ్‌లకు ఉపాధి కల్పించాలి
- ఎమ్మెల్యే హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాట్లాడుతున్న హరీశ్‌రావు

కమీషన్‌లతో జేబులు నింపుకోవడానికి, ఢిల్లీకి కప్పం కట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం లక్ష కోట్ల టెండర్లను పిలుస్తున్నదే తప్ప ప్రజల సంక్షేమ కోసం కాదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని విస్మరించి వారి జేబులు నింపుకోవడానికి మాత్రమే పని చేస్తోందని విమర్శించారు. సోమవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో శాసనమండలి వైస్ చైర్మెన్ బండ ప్రకాష్ ముదిరాజ్‌తో కలసి కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్, పండుగ సాయన్న ముదిరాజ్ విగ్రహాల ఆవిష్కరణలో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగ సాయన్న, కొరివి కృష్ణస్వామి విగ్రహాలు పాలమాకుల గ్రామంలో ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. వారి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా చెరువుల్లో నీళ్లు నింపి చేపల పెంపకానికి కృషి చేయడంతో ముదిరాజులకు ఉపాధి కల్పించామని చెప్పారు. కానీ ప్రస్తుతం ఏ గ్రామంలోకి వెళ్లినా చెరువులు ఎండిపోయి చేపలు చనిపోతున్నాయని వాపోయారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో వానాకాలం రాకముందే టెండర్లను పిలిచి చేప పిల్లలను పెంపకానికి సిద్దపడే వాళ్లమని, జూన్ నెల వచ్చినా ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లల టెండర్లు కూడా పిలవలేదని ఆరోపించారు. దీన్ని బట్టి ముదిరాజుల పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమవుతోందన్నారు. కనీసం ఇప్పటికైనా బడ్జెట్ కేటాయించి అన్ని చెరువుల్లో, కుంటల్లో చేప పిల్లలు వదలాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీలుగ విత్తనాలివ్వడంలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఎండబ్ల్యూఎస్ పరిధిలో రూ.పదివేల కోట్లతో, జిహెచ్‌ఎంసి రూ.7,000 కోట్లతో, హెచ్‌ఎండిఎ రూ. 20 వేల కోట్లతో టెండర్లు పిలిచినట్టు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో రేవంత్ రెడ్డి భూములు కొనుక్కుని ఆరు లైన్ల రోడ్డు వేసుకోవడానికి రూ.4,000 కోట్లు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. వీటన్నింటికీ డబ్బులు ఉన్నప్పుడు మత్స్యకారులు, ఇతర కులవృత్తుల వారికి ఉపాధి కల్పించడానికి మాత్రం డబ్బులు ఎందుకు ఉండటం లేదని ప్రశ్నించారు. ప్రజలు గమనిస్తున్నారని తగిన సమయంలో బుద్ధి చెబుతారని అన్నారు. శాసనమండలి వైస్ చైర్మెన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. మహనీయుల విగ్రహాలు నిరంతరం మనకు స్ఫూర్తినిస్తాయని అన్నారు. హైదరాబాద్ నగర తొలి మేయర్‌గా కొరికి కృష్ణస్వామి ముదిరాజ్ సమాజాభివృద్ధికి పాటు పడ్డారని తెలిపారు. పండుగ సాయన్న తన ప్రాణాలను లెక్కచేయకుండా పేదల కోసం పోరాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, పిఎసిఎస్ చైర్మన్లు కోల రమేశ్ గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు ఆనగోని లింగం గౌడ్, బిఆర్‌ఎస్‌వి మండల నాయకులు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణను అడ్డుకుంటున్న పోలీసులు

సిరిసిల్లలో ప్రొటోకాల్ వివాదం

- ఎమ్మెల్యే కెటిఆర్ క్యాంపు కార్యాలయం ముట్టడి
- కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నేతల ఘర్షణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిరిసిల్లలో ప్రొటోకాల్ విషయంలో తలెత్తిన వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. కాంగ్రెస్ వర్సెస్ బీఆర్‌ఎస్‌గా ఇరు పార్టీల నేతలు సవాళ్లు.. ప్రతి సవాళ్లు విసురుకుంటూ ఘర్షణ వాతావరణాన్ని సృష్టించారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటో పెట్టాల్సిందేనని, లేకపోతే కార్యక్రమాలను అడ్డుకుంటామని ఒక బిఆర్‌ఎస్ నాయకుడు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశాడు. దీనికి ప్రతిగా ఓ కాంగ్రెస్ నాయకుడు సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో పెడతామని అదే సోషల్ మీడియా వేదికగా సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం సిఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టడానికి కాంగ్రెస్ నేతలు పెద్దఎత్తున కెటిఆర్ క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. అదే సమయంలో బిఆర్‌ఎస్ నాయకులు కూడా క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకోవడంతో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో ముందే క్యాంపు కార్యాలయం వద్ద భారీగా మోహరించిన పోలీసులు ఇరువురినీ అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే, పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఇరు పార్టీల కార్యకర్తలపై స్వల్ప లాఠీచార్జి చేశారు. అనంతరం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘర్షణలో పోలీసులతోపాటు పలువురు నేతలకు స్వల్ప గాయాలయ్యాయి.

మీడియాతో మాట్లాడుతున్న నారాయణ

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

- తుపాకులతో సమస్య పరిష్కారం కాదు : నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని, తుపాకుల వలన్లు సమస్య పరిష్కారం కాదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీ సత్య సాయి గ్రామర్ హైస్కూల్‌లో జన సేవాదళ్ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి అంటున్నారని, ఇది సాధ్యమయ్యే పని కాదన్నారు. పాకిస్థాన్ విషయంలో శాంతిని పాటించిన ప్రభుత్వం మావోయిస్టుల విషయంలో ఎందుకు ఖర్కశంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. నక్సలైట్లు కూడా ఈ దేశ పౌరులే అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. రెండు వైపులా తుపాకులు వదిలి, శాంతియుతంగా సమస్యను పరిష్కారించుకోవాలని సూచించారు. ఇప్పటికే శాంతి చర్చల విషయంపై మావోయిస్టుల నుంచి ఉత్తరం వచ్చిందని, దానిపై కేంద్రం స్పందించాలన్నారు. వెంటనే పీస్ కమిటీని ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, జనసేవ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేష్, నాయకులు గోశిక మోహన్, మోహన్ మారుపాక, అనిల్‌కుమార్, శంకర్, ఎఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె ధర్మేంద్ర, పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగరావు, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

బార్‌లో గొడవ.. ఆపేందుకు యత్నించిన యువకుడు మృతి

- బీర్ బాటిల్‌తో తలపై కొట్టిన స్నేహితుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బార్‌లో మద్యం మత్తులో స్నేహితుల మధ్య జరిగిన గొడవను ఆపేందుకు వెళ్లి యువకుడి మృతి చెందిన ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం చేగుంట గ్రామానికి చెందిన కుమ్మరి భాస్కర్- శ్రీమాత దంపతులు హైదరాబాద్ అంబర్‌పేటలోని బాబునగర్‌లో నివాసం ఉంటున్నారు. భాస్కర్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు ప్రవీణ్ నాలుగేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. రెండో కుమారుడు పవన్ కుమార్ (25)పైనే వారు ప్రాణం పెట్టుకున్నారు. అయితే, పవన్ ఆదివారం రాత్రి తన స్నేహితులైన హరి, శ్రవణ్, మరో స్నేహితుడితో కలిసి 11 గంటల సమయంలో రామంతపూర్‌లోని గుడ్ డే బార్‌కు వెళ్లారు. హరి, పవన్ కుమార్ ఓ బెంచ్‌లో, శ్రవణ్ మరో స్నేహితుడు కలిసి ఇంకో బెంచ్‌లో కూర్చున్నారు. మద్యం తాగాక హరి, శ్రవణ్ మధ్య గొడవ జరిగింది. వారిని ఆపడానికి ప్రయత్నించిన పవన్ కుమార్ తలపై శ్రవణ్ బీర్ బాటిల్‌తో కొట్టాడు. దాంతో పవన్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. బార్ యజమాన్యం, సిబ్బంది వెంటనే స్పందించి ఉంటే తమ కుమారుడు బతికే వాడని మృతుని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ఒంటరి మహిళ దారుణ హత్య

- సంగారెడ్డి జిల్లా రుక్మాపూర్ గ్రామంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒంటరిగా ఉన్న మహిళను గుర్తు తెలియని వ్యక్తులు ముక్కు నోరు మూసి శ్వాస ఆడకుండా చేసి హత్య చేసిన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలం రుక్మాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. సిఐ హనుమంతు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రుక్మాపూర్ గ్రామానికి చెందిన బోరంచ రాణమ్మ (50) కూతురికి వివాహం చేసి, తాను ఒంటరిగానే జీవిస్తోంది. కాగా, సోమవారం ఉదయం రాణమ్మ ఇంటి తలుపులు తీయకపోవడంతో ఇరుగుపొరుగు వారు ఇంటి తలుపులు తెరిచి ఇంట్లోకి వెళ్లి చూడగా రాణమ్మ విగతజీవిగా పడి ఉంది. వెంటనే వారు పోలీసులకు సమాచారమందించారు. పోలీస్ జగిలాలతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. రాణమ్మ మెడలో ఉన్న అరతులం బంగారు నగలను సైతం దుండగులు దోచుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సిఐ హనుమంతు తెలిపారు.

నిమ్జ్ డబ్బుల కోసమే హత్య జరిగిందా..?

రాణమ్మకు గ్రామంలోని సర్వే నంబర్ 48లో మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ పొలం ఇటీవలే నిమ్జ్ కోసం సేకరించారు. మొదటి విడత డబ్బులు కూడా రాణమ్మ తీసుకున్నట్టు గ్రామస్తుల ద్వారా తెలిసింది. అందరితో కలిసిపోయి ఉండే రాణమ్మ హత్యకు నిమ్జ్ డబ్బులే కారణమా.. అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా పోలీసులు తమ విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు, రాణమ్మ కూతురు స్వాతి విజ్ఞప్తి చేస్తున్నారు.